క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 110, పచ్చిమిర్చి 110, బెండ 50, కాకర 70, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220.

సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టు మిషన్ భగీరథ

శేరిలింగంపల్లి: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కలల ప్రాజెక్టు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లెజెండ్ మ్యారీ గోల్డ్ విల్లాస్ మంజీర పైప్‌లైన్ పనులు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం రాత్రి వారికి కుళాయి ద్వారా నీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో పాత మంచినీటి పైప్‌లైన్‌ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి కలుషితం కాకుండ చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో బోనాల ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు


మధురానగర్‌లో పురాతన ఎదురుగడ్డమైసమ్మ అమ్మవారు

రాయదుర్గం: తెలంగాణా సంస్కృతికి అద్దం పట్టే ఆషాడ బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌లో వెలసిన శ్రీ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు మంగళవారం నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. రాయదుర్గం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళే రోడ్డులో ఎదురుగడ్డ వద్ద వెలసిన మైసమ్మ ఆలయానికి ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారిగా పిలుస్తూ వచ్చారు. మధురానగర్ తోపాటు రాయదుర్గం, ఖాజాగూడ, మణికొండ, ప్రశాంత్‌హిల్స్‌కాలనీ,గచ్చిబౌలి ప్రాంతాలకు చెందిన వారు తమ మొక్కులు తీర్చుకోవడానికి బోనాల సందర్భంగా ఘటాలు,బోనాలు అమ్మవారికి సమర్పిస్తారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని వివిధ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌కాలనీలోని నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రారెడ్డినగర్ కాలనీలో పలుచోట్ల వర్షపు నీరు, డ్రైనేజీనీరు ఇళ్లలోకి చేరుతోందని తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, రామచంద్రారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, కాలనీవాసులు పాల్గొన్నారు.

'ఇంటిపన్నులు తగ్గించాలని లేఖలు రాస్తాం'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెరుతున్న ఇంటి పన్నును తగ్గించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖలు రాస్తామని తెల్లాపూర్ నేబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నుల విషయంపై రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపాలిటీ పరిధిలలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఇంటి పన్నులను తగ్గించాలని కోరుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు లక్ష లేఖలు రాయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎల్ఐజీ కాలనీ మీదుగా బస్సులు నడపండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీకాలనీ, బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ మీదుగా బస్ సర్వీసులు నడపాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మియాపూర్ డిపో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎల్ఐజీ కాలనీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో లింగంపల్లి నుంచి బీహెచ్ఈఎల్, ఎల్ఐజీకాలనీ, రామచంద్రాపురం పట్టణం మీదుగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవని తెలిపారు. కొంతకాలంగా ఈమార్గంలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భారతినగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, నందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్లు...

దుర్గంధం


కాయిదమ్మకుంట చెరువు వద్ద పైప్‌లైన్‌కు చాంబర్ నిర్మించకపోవడంతో మురుగు నీరు చెరువులో కలుస్తున్న దృశ్యం

- అసంపూర్తి పనులతో స్థానికులకు ఇబ్బందులు
- చెరువుల సుందరీకరణ పనులు ముందుకు సాగేనా..?
- పైప్‌లైన్ జంక్షన వద్ద చాంబర్లు నిర్మించాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

హఫీజ్‌పేట్ : జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలను సుందరీకరణ కోసం ప్రత్యేక నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులకు సుందరీకరణంటూ పనులు ప్రారంభించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు చెరువులు సుందరీకరణ దాదాపు పూర్తికావచ్చినా మరి కొన్ని చెరువులకు కనీసం పట్టించుకోవడం లేదు. కాయిదమ్మకుంట చెరువు చుట్టుపక్కల ఉన్న కాలనీలు, పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కానీ వారికి అందుబాటులో ఉన్న చెరువు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట చెరువు చుట్టు పైప్‌లైన్ వేసినప్పటికీ చాంబర్లు నిర్మించలేదు. వినాయకచవితి, బతుకమ్మ పండుగలు వస్తే చెరువు కట్ట వద్ద హడావుడి చేసి చెరువులోని గుర్రపు డెక్కతో పాటు చెత్తను తొలగిస్తారు. పండుగుల తరువాత చెరువును పరిశీలించే అధికారి మాత్రం ఉండరు. ఇప్పటికైన చెరువు సుందరీకరణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని స్థానికుల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు ఇవే....

- కాయిదమ్మకుంట చెరువు చుట్టూ పైప్‌లైన్ వేసినా చాంబర్లు నిర్మించలేదు. దాని వల్ల గేటెడ్ కమ్యూనిటి వాసులకు దుర్వాసన, దుర్గంధం సతమతమవుతున్నారు.
- గుర్రపు డెక్క తొలగించినప్పటికీ తిరిగి మరల పెరిగింది.
- చుట్టు పక్కల కాలనీలు భారీగా పెరగడంతో వాటి నుంచి మురుగు నీరు చేరువులోకి వదిలేస్తున్నారు.


పైప్‌లైన్ల వద్ద చాంబర్ నిర్మించుకుండా వదిలేసిన దృశ్యం

- కుంట పక్కనే స్క్రాప్ దుకాణం వల్ల కూడా చెరువంతా దుర్గంధంగా మారుతుంది.
- చుట్టు పక్కల కాలనీలకు దోమల వల్ల చిన్న పిల్లలకు విష జ్వరాలు వెదజల్లుతున్నాయి.
- చెరువు కట్టపై ఇష్టానుసారం చెత్త చెదారం, వాహనాల పార్కింగ్ చేయడం వల్ల వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- తూతూ మత్రంగా చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు కానీ అనంతరం దానిని పట్టించుకోవడం లేదు.

చెరువు వద్ద చేపట్టాల్సిన పనులు

- చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్ వాసిన వాటికి వెంటనే చాంబర్లు నిర్మించాలి.
- చెరువులో ఎంటమాలజీ సిబ్బందితో దోమల నివారణ పిచకారి చేయించాలి.
- కాయిదమ్మ కుంట చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచి త్వరతగతిన పూర్తి చేయాలి
- వాకింగ్ ట్రాక్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలి
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సూచిక బోర్డు పెట్టాలి
- కట్టపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి
- చెరువులో ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి
- ప్రతి రోజు చెరువు సంరక్షణ కోసం సిబ్బందిని నియమించాలి
- చెరువులో భవన నిర్మాణాల వ్యర్థాలు వేయకుండా చూడాలి


చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్క

పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తాం..

మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట వరకు చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించాం. కానీ రెండు పైప్‌లైన్లు కలిసే వద్ద చాంబర్లు నిర్మించాలి. త్వరలోనే ఆ చాంబర్లు నిర్మిస్తాం. అంతే కాకుండా సుందరీకరణ పనులు కూడా పూర్తి చేస్తాం.

– శేషగిరిరావు, ఇరిగేషన్ డీఈ

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం


గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ,కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి: దశలవారిగా అన్ని కాలనీలు,బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్‌లో రూ.13.21 కోట్లతో చేపట్టే సీసీరోడ్లు,వరదనీటికాలువలు, శ్మశానవాటిక అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి సోమవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా, ప్రధాన రోడ్లను బీటీరోడ్లుగా మార్చే పనులు సాగుతున్నాయన్నారు. డ్రైనేజీ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు వరదనీటికాలువలు, నాలాల విస్తరణ, మురుగునీటి కాలువల నిర్మాణం చేస్తామన్నారు. ఇప్పటికే అన్నికాలనీలు,బస్తీలలో తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రధానంగా ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ వంటి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య దూరం చేయడానికి లింకు రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు గతంలో ఎన్నడూ లేని విధంగా చేపట్టడం జరిగిందన్నారు. ఇక అంతటా ఉన్న శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శేరిలింగంపల్లిలోని చెరువులన్నింటి నీ సుందరీకరించి స్థానికులు సేదతీరుతూ వాకింగ్, సైక్లింగ్ చేయడానికి ప్రత్యేక ట్రాక్‌లు ఏర్పాటు చేయడం, గ్రీనరీతో ఇట్టే అందరినీ ఆకట్టుకునేలా మార్చడం జరుగుతోందన్నారు. ఇప్పటికే దుర్గంచెరువు, మల్కంచెరువు సుందరీకరించడం జరిగిందని, ఖాజాగూడ పెద్ద చెరువు సుందరీకరణ పనులు సాగుతున్నాయని, ఇతర చెరువులలో కూడా ఇలాంటి పనులు చేపడుతామన్నారు. ప్రతి డివిజన్లలో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు సాగుతున్నాయని, వాటన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి చేపట్టే ప్రతి పనిలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కాలనీవాసులు,మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌ముదిరాజ్, హోప్‌ఫౌండేషన్ చైర్మన్ కొండావిజయ్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న స్థానిక నాయకులు

గచ్చిబౌలి: నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మసీద్‌బండలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌పార్టీలో చేశారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ 9 ఏళ్లెనా ఆ ఊసే లేదన్నారు. తెలంగాణ రాజకీయాలలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భరత్ యాదవ్, అమార్, మిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: శ్రీలా గార్డెన్, మియాపూర్, లోటస్ కాలనీ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం గంటల వరకు శ్రీలా గార్డెన్, రాయ్ డెవలపర్స్, లెక్ వ్యూ, శారద స్కూల్ ఏరియా అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లోటస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వసంత సిటీ ఫీడర్ పరిధిలో సైబర్‌వ్యాలీ, సైబర్ విలేజ్, సంకల్ప్ అపార్ట్‌మెంట్స్, వసంత విల్లాస్, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాక్ ఎంట్రిన్స్ రోడ్, అపర్ణ అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్ విలేజ్, జూబ్లీ గార్డెన్, అలేఖ్య అపార్ట్‌మెంట్స్ పరిసరాలు తదితర ప్రాతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-1, , మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2 తదితర ప్రాతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాపున గర్ మసీదు ప్రాంతం, అలిండ్ కంపెనీ, గుల్‌మోహర్‌పార్కు, డాక్టర్స్ కాలనీ, మున్సిపల్ ఆఫీస్ వంటి ప్రాంతాలలో విద్యుత సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించాలని వారు సూచించారు.

జేఎన్‌వి విద్యుత్ ఫీడర్ పరిధిలో..

11కేవీ జవహర్‌నవోదయవిద్యాలయ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంచ గచ్చిబౌలి, సాయిరామ్‌నగర్, అపర్ణా సరోవర్, డీ మార్ట్ వెనుకప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

హెచ్‌సీయూ ముగ్గురు ప్రొఫెసర్లకు అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ప్రొఫెసర్లకు అరుదైన అవార్డులు లభించాయి. సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా విజిటర్స్ అవార్డులను ఇద్దరు ప్రొఫెసర్లు అవార్డులను స్వీకరించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్లు కేసీ జేమ్స్‌రాజుకు, ప్రొఫెసర్ సుర్జిత్‌ధారాకు 2022-23 సంవత్సరానికిగాను,2021-22 సంవత్సరానికిగాను స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ అనునయ్‌సమంతాలకు ఈ అవార్డులు లభించాయి. ముగ్గురు ప్రొఫెసర్లను హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు వారిని అభినందించారు.

పేద ప్రజల జీవితాల్లో 58,59 జీఓ భరోసా

–ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: జీఓ నెంబర్ 58,59 తీసుకొచ్చి దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేదలకు రెగ్యులరైజేషన్ చేసి జీవితం పై భరోసా కల్పించిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలోని శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, భారతీనగర్ డివిజన్ల పరిధిలో 58,59 జీఓ కింద దరఖాస్తు చేసుకొని అర్హులైన 30 మంది లబ్ధిదారులకు తహశీల్దార్ వంశీమోహన్‌తో కలిసి ఆయన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 58 ప్రకారం నిరుపేదలు నివాసముంటున్న స్థలాలకు రెగ్యులరైజేషన్ చేసి భరోసా కల్పించడంతో పాటు 59 జీఓ కింద ప్రభుత్వం నిర్ణయించిన డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని 5 శాతం రాయితీని సైతం పొందారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ భవనం ప్రారంభోత్సవం

మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతాండలో నూతనంగా నిర్మించిన గిరిజన సంక్షేమ భవనాన్ని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సోమవారం ప్రారంభించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.


58 జీఓ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన...

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులుతో కలిసి స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు వర్షా కాలంలో వరద ముందుకు కాలనీలు గురికాకుండా నాలాల పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. నాలాలో పేరుకుపోయిన చెత్త చెదారంను తొలగించి బాక్స్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. డివిజన్ పరిధిలో ప్రతి కాలనీ, బస్తీలలో ఎలాంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఈఈ శ్రీకాంతి, డీఈ, ఏఈ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్బర్ ఖాన్, అంజద్, అఫ్సర్, గిరి తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

మధ్యాహ్న భోజన కార్మికుల

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు టోకెన్ సమ్మె నోటీసు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2022 మార్చి బడ్జెట్ సందర్భంగా తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కొత్త మెనూ ప్రకారం ధరలు సవరించడంతో పాటు పెండింగ్ బిల్లులకు తక్షణం విడుదల చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను అక్షయ పాత్ర అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల మంది కార్మికులు 24 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారని వివరించారు. కార్మికుల సమస్యల పట్ల తెలంగాణ ప్రభుత్వం స్పందించాలని సోమవారం నుంచి మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి కొంగరి కృష్ణ, ప్రతినిధులు శ్రీశైలం, మాణిక్యం, రాణిబాయి, షేక్ షీరబ్ అలీ, రాములు, నసీమా, విజయమ్మ, ఉమారాణి, వరమ్మ, పాష తదితరులు పాల్గొన్నారు.